
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





యాలాల పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

# ఎస్ఐ గుడ్.. స్టేషన్ ఆల్సో వెరీ గుడ్

## ఎస్పీ స్నేహా మెహ్రా కితాబు

**యాలాల, జూన్ 12, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా శుక్రవారం యాలాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా యాలాల పిఎస్‌ను సందర్శించిన ఎస్పీ ముందుగా స్టేషన్ ఆవరణ, పరిసరాల పరిశుభ్రతను ఆమె పరిశీలించారు. అదేవిధంగా స్టేషన్‌లో వివిధ రికార్డులను, రిజిష్టర్లను నిశితంగా పరిశీలిచి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్టేషన్‌కు వచ్చే పిర్యాదుదారుల వివరాలు, నమోదైన కేసుల వివరాలు పురోగతి, బ్లూ కోర్టు, పెట్రో కార్ల నిర్వహణ తీరుపై ఎస్పీ ఆరా తీశారు. స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. యాలాల పోలీసుల పనితీరుపై ఎస్పీ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా అంకిత భావంతో విధుల నిర్వర్తిస్తున్న ఎస్ఐ విఠల్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఐ గుడ్, స్టేషన్ ఆల్సో వెరీ గుడ్ అంటూ ఎస్పీ కామెంట్ చేస్తూ ప్రశంసించారు. బాధితులకు సేవలందించడంలో పూర్తి పారదర్శకత కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు లేదా ఫైళ్లు పెండింగ్‌లో ఉంచవద్దని, ఎప్పటికప్పుడు దర్యాప్తు పూర్తిచేసి సంబంధిత వివరాలను ఆన్‌లైన్ (సిసిటిఎన్ఎస్)లో నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఆమె సూచించారు. దొంగతనాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని ఎస్పీ ఆదేశిచారు. ముఖ్యంగా మహిళలకు, వృద్ధులకు, పిల్లలకు భద్రతలో ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలని ఆమె సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలను త్వరగా పరిష్కారమయ్యేవిధంగా పని చేయాలని ఎస్పీ అధికారులకు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న సురక్ష మిత్ర,నిఘానేత్రం కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, యాలాల ఎస్ఐ విఠల్‌రెడి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# చేయని నేరానికి బలిపశువు?




**కానిస్టేబుల్ సస్పెన్షన్ వెనుక అసలు కథ!**

**డ్యూటీలో లేకున్నా బలవంతంగా పిలిపించి సస్పెండ్ చేశారనే ఆరోపణలు**

**సీసీ ఫుటేజీల ఆధారాలతో న్యాయ పోరాటానికి బస్వరాజ్ సమాయత్తం**

**నిందితురాలు కరీమాబేగం సూసైడ్ కేసులో కొత్త ట్విస్ట్**

**స్టేషన్ అధికారులకు కేవలం ఛార్జ్ మెమోలపై ప్రజాసంఘాల ఆందోళన**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జంట హత్యల కేసులో నిందితురాలు కరీమాబేగం కస్టడీలో యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. ఆమె ఠాణాలో యాసిడ్ తాగిన విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఆదరబాదరగా యాలాల పీఎస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ బస్వరాజ్‌ను డ్యూటీకి పిలిపించారు. సంఘటన జరిగిన రోజు విధుల్లో లేకున్నా బలవంతంగా ఆయనకు పాస్‌పోర్ట్ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్రమత్తంగా లేరనే కారణంతో ఒక మహిళా కానిస్టేబుల్‌తోపాటు బస్వరాజును కూడా సస్పెండ్ చేశారు. వీరిద్దరి నిర్లక్ష్యం కారణంగానే నిందితురాలు యాసిడ్ తాగిందని పోలీసు ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణలో పేర్కొన్నారు. ఇద్దరు అధికారులకు ఛార్జ్‌మెమో కూడా ఇచ్చారు. అయితే సంఘటన జరిగిన రోజు తాను విధుల్లో లేనట్లు తగిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలను సేకరించి డీఐజీని ఆశ్రయించేందుకు బస్వరాజ్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆయనకు స్థానిక ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. కిందిస్థాయి సిబ్బందిని బలిపశువులుగా మార్చడం అప్రజాస్వామికమని సీపీఎం నేత శ్రీనివాస్ మండిపడుతూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

**తప్పటడుగులు ఎన్నో..**

పోలీసుల ప్రతిష్టకు మరకలంటున్న ఈ సంఘటనలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. జంట హత్యల అనంతరం తాండూరు రూరల్ సీఐ ఆధ్వర్యంలో యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం గౌతాపూర్‌కు తరలించారు. సీఐ ఆఫీసులో మూత్రశాలలకు తాళం వేసి ఉండటంతో ఆమెను గ్రౌండ్ ఫ్లోర్ కామన్ బాత్రూమ్‌కు తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల పర్యటన కోసం బాత్రూమ్ శుభ్రం చేయించిన పోలీసులు, అందులోని యాసిడ్ బాటిల్‌ను తొలగించడం మరచిపోయారు. బాత్రూమ్‌లో యాసిడ్ తాగిన నిందితురాలిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన జరిగిన తర్వాత కానిస్టేబుల్ బస్వరాజ్‌ను పోలీసు అధికారులు బలవంతంగా పిలిపించారన్న విమర్శలు వస్తున్నాయి. నిందితురాలు హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించింది. ఈ కేసులో పోలీసుల టార్చర్ లేకపోయినా, వారి ఉదాసీనత, నిరక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు వస్తున్నాయి.

**తాండూరు పోలీస్‌కు మరిన్ని మరకలు**

**దాడిలో దవడ విరిగిన లారీ డ్రైవర్ వెంకటేష్ ఫిర్యాదు బుట్టదాఖలు**

**రూ. 40 వేలు ఇప్పించి కేసు సెటిల్‌మెంట్!**

**బాధితులకు న్యాయం జరగటం లేదని విమర్శలు**

**నాడు అలా అయితే నేడు ఇలా...**

గతంలో ధారూరు ఠాణాలో బూట్ల లేస్‌తో ఒకరు, 22 ఏళ్ల క్రితం యాలాల పోలీసుస్టేషన్‌లో కిరోసిన్ పోసుకుని రాస్నం గ్రామానికి చెందిన నిందితుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ కేసుల్లో పోలీసుల టార్చర్ లేకున్నా బాధ్యులైన అధికారులపై వేటు వేశారు. ప్రస్తుత కేసులో కేవలం యాలాల, కరణ్‌కోట ఎస్ఐలకు ఛార్జ్ మెమోలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

**తాండూరు ఖాకీలపై విమర్శల వెల్లువ**

ఇటీవల తాండూరు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వివిధ కేసులలో బాధితులకు న్యాయం జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి.

**ఫిర్యాదుకు రశీదు ఇవ్వకపోగా...**

రెండు వారాల క్రితం యాలాల మండలం బాణాపూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వెంకటేష్‌పై కరణ్‌కోట గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేయడంతో దవడ విరిగిపోయింది. న్యాయం చేయాలని కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఫిర్యాదుకు రశీదు కూడా ఇవ్వకుండా నిరక్ష్యం చేసి, ఐదు రోజుల క్రితం రూ. 40 వేలు ఇప్పించి సెటిట్‌మెంట్ చేశారు.

**బషీరాబాద్ యువకుడి మృతి కేసులోనూ..**

బషీరాబాద్ మండలంలో ఓ యువకుడి(తలారీ హరికృష్ణ) అనుమానాస్పద మృతి కేసులోనూ పోలీసులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తమవుతోంది.

**అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నాం : డీఎస్పీ**

కరీమాబేగం కేసు వ్యవహారాన్ని అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని, ఎవరి నిరక్ష్యం ఉన్నా ఉపేక్షించబోమని తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య స్పష్టం చేశారు. నిందితురాలు మహిళల మరుగుదొడ్డి కావాలని కోరడం వల్లే గ్రౌండ్ ఫ్లోర్‌కు పంపినట్లు వివరించారు. బషీరాబాద్ మండలంలో తలారీ హరికృష్ణది హత్య కాదని పోస్టుమార్టం నివేదికలు వచ్చాయని చెప్పారు. తమ సబ్‌డివిజన్ పరిధిలో రక్షణ కోసం వచ్చే బాధితులకు తక్షణ సహాయం అందజేస్తామని చెప్పారు. అయితే, డ్రైవర్ వెంకటేష్‌పై జరిగిన దాడి సంఘటన తన దృష్టికి రాలేదని ఆయన వివరణ ఇచ్చారు.



అండర్‌పాస్‌ను పరిశీలిస్తున్న ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డిసిపి శివం ఉపాధ్యాయ

# అండర్‌పాస్‌లో నీటి నిల్వలకు చెక్..

## అదనపు మోటార్ ఏర్పాటుకు డిసిపి ఆదేశం

**కొత్తూరు, జూన్ 12, ప్రభాతవార్త:** వర్షాకాలంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొత్తూరు మున్సిపాలిటీ వై జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లో నీటి నిల్వలను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అండర్‌పాస్‌ను ఆయన పరిశీలించి, షాద్‌నగర్ టోల్ ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ విశ్వనాథ్ రాజుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ, వర్షాకాలంలో అండర్‌పాస్‌లో నీరు నిల్వ ఉండటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనదారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, నీటి తొలగింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అన్నారు. ప్రాజెక్టు మేనేజర్ విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ, ప్రస్తుతం 40 హెచ్‌పీ మోటార్ ద్వారా అండర్‌పాస్‌లోని నీటిని తొలగిస్తున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన డీసీపీ, అదనంగా మరో 20 హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేసి వర్షపు నీటిని వేగంగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శంకరయ్య, టోల్ ప్లాజా సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 22.8 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం

## ప్రధాన సూత్రధారి కోసం పోలీసుల గాలింపు

**షాద్‌నగర్, జూన్ 12, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం లాల్‌సింగ్ తండాలో నిషేధిత పత్తి విత్తనాల అక్రమ నిల్వ వెలుగులోకి వచ్చింది.

వ్యవసాయ శాఖ అధికారులు, షాద్‌నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో భారీగా హెచ్‌టి కాటన్ రకం నిషేధిత పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు జిల్లేడు చౌదరిగూడెం మండల వ్యవ సాయ అధికారి, ఫరూఖ్‌నగర్ మండల ఇన్‌చార్జ్ ఐదలాపల్లి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ బొడ్డు వినయ్, షాద్‌నగర్ పోలీస్ సిబ్బంది కలిసి లాల్‌సింగ్ తండాలోని ఓ ఇంటిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇంట్లో దాచిన 52 సిల్వర్ కలర్ ప్యాకెట్లు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ సుమారు 438 గ్రాముల బరువుతో ఉండగా, మొత్తం 22.8 కిలోల విత్తనాలు లభ్యమయ్యాయి. ప్యాకెట్లపై ఎలాంటి వివరాలు లేకపోవడం గమనించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాలు

విచారణలో ఇంట్లో విత్తనాలు నిల్వ ఉంచిన పల్యావత్ కవిత.. కొందుర్గ్ మండలం పాత అగిర్యాల గ్రామానికి చెందిన అగిర్యాల రాజేశ్వరి వద్ద తాను పనిచేస్తున్నట్లు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. రాజేశ్వరి సూచనల మేరకే విత్తనాలను ఇంట్లో దాచినట్లు చెప్పినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న విత్తనాల్లో నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించారు. మిగిలిన విత్తనాలను తదుపరి చర్యల కోసం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనపై వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అగిర్యాల రాజేశ్వరి పరారీలో ఉన్నట్లు పోలీ సులు తెలిపారు. ఆమెను అదుపులోకి తీసుకుంటే అక్రమ విత్తనాల సరఫరా వెనుక ఉన్న మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిషేధిత, నకిలీ విత్తనాల విక్రయాలు లేదా నిల్వలకు పాల్పడితే చర్యలు తీసుకుం టామని పోలీసులు హెచ్చరించారు.

# మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అరెస్ట్

## భూసేకరణకు వ్యతిరేకంగా కాడ్లాపూర్ రైతుల ఆమరణ దీక్షలో ఉద్రిక్తత

**పరిగి జూన్ 12 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని కాడ్లాపూర్ గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్, రైతులు చేపట్టిన అమరణ నిరాహార దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు తెలపడానికి బయలు దేరిన పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను అరెస్ట్ చేసి చెన్ గోముల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వివరాలలోకి వెళితే.. పరిగి మండలంలోని కాడ్లాపూర్, రాపోల్, బాట్ల చందారం గ్రామాలలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం ప్రభుత్వం మొత్తం 1,197 ఎకరాలలో భూసేకరణ చేపడుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం కాడ్లాపూర్ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడానికి అధికారులు గ్రామ సభ నోటీసులు ఇచ్చారు. అయితే, తమ భూములు ఇవ్వడానికి నిరాకరిస్తూ కాడ్లాపూర్ రైతులు గత 78 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. భూసేకరణ జీఓను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




ఆమరణ దీక్ష చేస్తున్న కాడ్లాపూర్ రైతులు



మాజీ ఎమెల్యే మహేష్ రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కాడ్లాపూర్ గ్రామంలో 428 ఎకరాల గౌటాన్, 159 ఎకరాల పట్టా భూముల సేకరణను అధికారులు నిలిపివేయాలని, భూమి లేకపోతే తాము బతకలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11 గంటల నుండి కాడ్లాపూర్ గ్రామ సర్పంచ్ పులేందర్, ఉప సర్పంచ్ డి. రమేష్, రైతులు జంగయ్య, బాలయ్య, భాను, అశోక్ అనే ఆరుగురు ఆమరణ దీక్ష చేపట్టారు. శుక్రవారం నాటికి వారి దీక్ష రెండో రోజుకు చేరింది. గ్రామంలో దాదాపు 300కు పైగా కుటుంబాలు కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రాణాలు పోయినా సరే భూములను ఇచ్చేది లేదని సర్పంచ్ పులేందర్ స్పష్టం చేశారు. ఒకవేళ ఈ దీక్షను పోలీసులు భగ్నం చేస్తే, మరో ఆరుగురు ఆమరణ దీక్షకు కూర్చుంటారని హెచ్చరించారు.

**పోలీసులపై గ్రామస్థుల తిరుగుబాటు**

దీక్షకు మద్దతుగా గ్రామస్థులు, మహిళలు కూడా పెద్ద ఎత్తున నిరాహార దీక్షలో కూర్చున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో బారికేడ్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించిన పోలీసులను గ్రామస్థులు, మహిళలు అడ్డుకుని, ఆ బారికేడ్లను తొలగించారు.

ఆమరణ దీక్ష చేస్తున్న సర్పంచ్, రైతులకు సంఘీభావం తెలపడానికి పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి బయలు దేరారు. అయితే, మార్గమధ్యంలో రంగాపూర్ గ్రామం వద్ద పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, మహేష్ రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బిఆర్ఎస్ నాయకులు ఆయన అరెస్టును అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, తీవ్ర ఉద్రిక్తతల మధ్య పోలీసులు మహేష్ రెడ్డిని అరెస్ట్ చేసి చెన్ గోముల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల ఈ చర్యపై మహేష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బీజాపూర్ జాతీయ రహదారిపై బిఆర్ఎస్ శ్రేణుల ధర్నా**

**పూడూరు, జూన్ 12, ప్రభాతవార్త :** మహేష్ రెడ్డి అరెస్ట్ విషయం తెలుసుకున్న పూడూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యేను కలవడానికి పోలీసులు నిరాకరించడంతో, ఆగ్రహించిన కార్యకర్తలు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బైటాయించి ధర్నా నిర్వహించారు. మోమిన్‌పేట్ సిఐ వెంకట్ నచ్చజెప్పడంతో మొదట ధర్నా విరమించినప్పటికీ , ఆ తర్వాత స్థానిక ఎస్ఐ భరత్ కుమార్‌రెడ్డికి, బిఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. దీనితో ఆగ్రహించిన కార్యకర్తలు మళ్లీ జాతీయ రహదారిపై బైటాయించి, సిఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, ఎస్ఐలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. దీనివల్ల జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సాయంత్రం సుమారు 6:20 గంటల ప్రాంతంలో పోలీసులు మహేష్ రెడ్డిని విడుదల చేయడంతో నిరసనకారులు ధర్నాను విరమించారు.



రోడ్డుపై బైఠాయించిన నాయకులతో మాట్లాడుతున్న మోమిన్‌పేట్ సిఐ

విడుదలైన అనంతరం మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. పేద రైతుల భూములను లాక్కోవడం సరైన పద్ధతి కాదని, ఇండస్ట్రియల్ పార్క్ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాపోరాటం చేస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి మహేష్ రెడ్డిని పరామర్శించారు. పేదల భూములను గుంజుకొని సొమ్ము చేసుకునేందుకే సిఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై మరియు పోలీసుల అక్రమ కేసులపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



పరిశ్రమ కలుషిత నీటితో రంగుమారిన చెరువు నీరు

# మత్స్యకారుల ఉసురు తీస్తున్న పరిశ్రమ కాలుష్యం

## విషజలాలతో చేపలు చనిపోతున్నాయ్

## గోధుమకుంట చెరువును పరిరక్షించాలి


## కాంగ్రెస్ నేత ఆందోళన

**కొత్తూరు జూన్12, ప్రభాతవార్త :** కొత్తూరు మున్సిపల్ పరిధిలోని గోధుమకుంట చెరువు (సర్వే నంబర్ 173) పరిరక్షణ కోసం స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్ గళమెత్తారు. రవి ఫుడ్స్ కంపెనీ172 సర్వేనెంబర్ పట్టాదారు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడమే కాకుండా, రవి ఫుడ్ కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యజలాలను చెరువులోకి విడుదల చేయడం వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావంతో చెరువులో వదిలిన చేపలు పెద్ద ఎత్తున మృతి చెందుతున్నాయని, దీంతో మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని దేవేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రజల తరఫున తాను ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నానని, వెంటనే కాలుష్య నియంత్రణ శాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచరాదని స్పష్టం చేశారు.

# చేవెళ్లకు 5జి బిఎస్ఎన్ఎల్ సేవలు

## -ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**వికారాబాద్, ప్రభాతవార్త :** చేవెళ్ల పార్లమెంటు పరిధిలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన 5జి బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల సత్వర నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రసార మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.భాస్కర రావు, డిజిఎం అశోక్, లక్ష్మణ్ కుమార్, గణేష్ ఎంపీతో సమావేశమై బిఎస్ఎన్ఎల్ సెల్ఫోన్ టవర్ల విషయమై చర్చించారు. దాదాపు 14 కోట్ల వ్యయంతో 7 సెల్ ఫోన్ టవర్లు త్వరలోనే నిర్మాణం ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. మారుముల ప్రాంతాలలో నెట్వర్క్ సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి సత్వరమే ఇక చర్యలు తీసుకొని నెట్వర్క్ సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి వారిని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏడు సెల్ ఫోన్ టవర్లు మంజూరు చేసిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, బిఎస్ఎన్ఎల్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ రత్నకుమార్, హైదరాబాద్ టెలికం అధికారులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.



# నిబంధనల ప్రకారం భూసేకరణ

## - కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు ఆర్అండ్ఆర్ ఎల్ఏ కమిషనర్ కే.శివకుమార్ నాయుడు లతో కలిసి సమావేశము నిర్వహించారు. జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై సంబంధిత శాఖ అధికారులతో సుధీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసేకరణ పనుల పురోగతి, భూ యజమానులకు చెల్లించాల్సిన పరిహారం, పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులు చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ యజమానుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ, ప్రాజెక్టుల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఫేస్ 2 వికారాబాద్ జిల్లా గ్రావిటి కెనాల్ 1,2,3 బొంరాస్ పెట్, దుద్యాల్, కోడంగల్, దౌల్తాబాద్ మండలాలలో 1413 ఎకరాల భూ సేకరణ జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 1090 ఎకరాలకు ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా 323 ఎకరాలకు ప్రతిపాదనలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ సమక్షంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# వెద్యం కోసం వెళ్లి వస్తూ...

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి- కుమారుడికి తీవ్ర గాయాలు

**కందుకూరు, జూన్ 12, ప్రభాతవార్త:** మోటార్ సైకిల్‌ను టిప్పర్ లారీ ఢీకొన్న సంఘటనలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న తల్లి అక్కడికక్కడే మృతి చెందగా మోటార్ సైకిల్ నడిపిస్తున్న కుమారుడు తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. హృదయ విదారకమైన ఈ సంఘటన ఫార్మా పిఎస్ పరిధిలోని ఆకుల మైలారం పంజాగుడ గ్రామాల శివారులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కందుకూరు మండల పరిధిలోని బేకర్ కంచ గ్రామానికి చెందిన ఢిల్లీ భారతమ్మ ఆరోగ్యం నలతగా ఉండడంతో సమీపంలోని ఆకుల మైలారం గ్రామంలో ఉన్న ఆర్.ఎం.పి డాక్టర్ వద్దకు తన కుమారుడు ఢిల్లీ అఖిల్ కుమార్ బైక్‌పై వెళ్లింది. తిరిగి వస్తుండగా మట్టిలోడుతో వెళుతున్న టిప్పర్ లారీ బైక్‌మీదకు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో అఖిల్ తీవ్రంగా గాయపడగా.. అతని తల్లి భారతమ్మ దుర్మరణం చెందింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హుటా హుటిన ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ నిరక్ష్యం వలనే ప్రమాదం జరిగిందని బాధితులు పేర్కొన్నారు.



బైక్‌మీదుకు దూసుకొచ్చిన లారీ



జేసిబితో మురుగుకాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

## ప్రజల ఆరోగ్యమే మా ప్రధాన లక్ష్యం

**పెద్దేముల్, జూన్ 12, ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని సర్పంచ్ చంద్రకళ శ్రీనివాస్ అన్నారు. పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి గ్రామంలో గత ఏన్నో ఎళ్ళుగా ఉన్న పారిశుద్ధ సమస్యను ప్రస్తుత సర్పంచ్ చంద్రకళ ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం జేసిబితో మురుగుకాలువలను శుభ్రం చేయించి శాశ్వత పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ మాట్లాడుతూ గత ఎన్నో ఎళ్ళుగా చెత్త చెదారంతో మురుగు కాలువలు నిండడం వల్ల దుర్గంధభరితంగా మారడంతో గ్రామస్థులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. దుర్వాసనతో పాటు దోమల వల్ల వివిధ రోగాల బారిన పడి ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యమే తమ ప్రధాన లక్ష్యమని, అందుకు పారిశుద్ధ పనులను చేయించి శాశ్వత పరిష్కారం చూపామని అన్నారు. దీంతో పరిశుభ్రత పెరగడంతోపాటు దుర్వాసన తగ్గి, ప్రజారోగ్యం మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. తింసాన్‌పల్లిని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులందరు సహకరించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ ముకుంద మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ సమితి అధ్యక్షుడు అనీఫ్, ఉపాధ్యాక్షుడు రవిందర్, సీనియర్ నాయకులు బుద్దారం నాగేష్, పల్లె రాములు, అలీ, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్ రెడ్డి

**కొత్తూరు, జూన్ 12,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం. కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె సుదర్శన్ గౌడ్‌తో కలిసి కొత్తూరు మండల పరిధిలోని గూడూరు, మక్తగూడ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి సారిగా నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ అభివృద్ధి, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పార్టీ విజయానికి కార్యకర్తల కృషే ప్రధాన బలమని శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి ప్రభాకర్, మునూరు పద్మారావు, మక్తగూడ గ్రామ సర్పంచ్ బోకుల శ్రీరాములు, మోడి దర్శన్, దయాల మల్లేష్, వడ్డే శేఖర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దయాల శ్రీను, ఏ. సతీష్, ఏ. శ్రీనుగౌడ్, ఖయ్యుమ్ బాయ్, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**కేశంపేట, జూన్ 12, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన తాడూరి నర్సింహ గత ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది రేకుల మాజీ వార్డ్ సభ్యుడు యాదగిరి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు బాలరాజు గౌడ్, కల్వకోలు తిరుపతి, గోస్కె నర్సింహ, ఆంజనేయులు, పురుషోత్తం,లాలమోని ఆంజనేయులు, చేపల చెంద్రయ్య,కసారపు సత్యనారాయణ, కృష్ణారెడ్డి, యాదగిరి, గోపాల్,మహాలింగం, పొగుల నర్సింహా, కుమార్, శేఖర్,బాలకృష్ణ, శ్రీశైలం, చాకలి మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

### మనగల్లు బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా లట్టుపల్లి రమాదేవి

**తలకొండపల్లి, జూన్ 12, ప్రభాత వార్త:**

ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన లట్టుపల్లి రమాదేవిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటించారు. తలకొండపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న లట్టుపల్లి రమాదేవి చురుకుగా పార్టీలో పని చేస్తుండడంతో డిసిసి నిర్ణయం మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమించినట్లు తెలిపారు. అధికారం ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న రమాదేవిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మహిళా అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలను మహిళలతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్తూ కాంగ్రెస్ బలోపి దానికి కృషి చేస్తానని రమాదేవి తెలిపారు. తనను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పారదర్శక పాలన అందించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ, జూన్ 12, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన మండల ఉపసర్పంచుల సంఘం కార్య నిర్వాహకానికి షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిశా నిర్దేశం చేశారు. ప్రజా పాలన.. ప్రగతిప్రణాళికలో ప్రభుత్వ నిధులు కేటాయించి, అభివృద్ధి చేసేందుకు తమ అండదండలు ఎల్లప్పుడు ఉంటాయని, పార్టీలను పక్కన పెట్టి పారదర్శకతతో పనిచేసి మంచి గుర్తింపు తేవాలని ఉప సర్పంచ్ల సంఘానికి సూచించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు గా ఎన్నికైన చేగూరు ఆవుల మంద శంకర్‌ను శాలువ వేసి సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షుడు ఎడ్ల వెంకటేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు సార వెంకటేష్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, బాల్రాజ్, ఫరక్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ మండల ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుని సన్మానించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## ముగిసిన మాదిగ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

**తలకొండపల్లి ,జూన్ 12, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రంలో గత 5 రోజులుగా మాదిగ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ముగిశాయి. శుక్రవారం నాడు గత 5 రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు ముగించడంతో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా యువకుల సోదర భావంతో పాటు మానసికోల్లాసం పెరుగుతుందన్నారు . తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా మాదిగ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా మొత్తం ఐదు టీములు పాల్గొని పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 5000 రూపాయలు ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 5000 రూపాయలు పొత్తు గంటి గణేష్ పోతుగంటి గణేష్, రెండో బహుమతి కింద పోలే కిరణ్ 3000 రూపాయలు, మూడో బహుమతి 1500 రూపాయలను ఆర్ఎస్ బైక్ పాయింట్ రాజుగారు అందజేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో పోటీలకు సహకరించిన తిరుమల్ల కుమార్ పోతుగంటి శివరాజ్ భాస్కర్‌ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోతుగంటి గణేష్ పోలే కిరణ్, కుమార్ భాస్కర్ రాజు తోపాటు క్రికెట్ పోటీదారులు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నాయకులు

## నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యం



లాల్‌గడిమలక్‌పేట్‌లో నూతన స్కూల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్న మున్సిపల్ చైర్మన్లు కె.శిరీషకృష్ణారెడ్డి, జాము రవి, పలువురు కౌన్సిలర్లు, మాజీ ఎంపిపి,మాజీ జడ్పీటిసి, మాజీ సర్పంచులు, నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 12, ప్రభాతవార్త:**

నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధితో పాటు విద్యారంగాన్ని విస్తరించటానికి సహకరించాలని, సమన్వయంతో కలిసి వెళదామని ఆయన అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్‌లో నూతనంగ ఏర్పాటు చేసిన సిఎంఆర్ స్కూల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యమని అన్నారు. తనను ఆదరించి మూడు సార్లు ఒక సారి ఎంపిగా, రెండు సార్లు (ఓ సారి మంత్రిగా) ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, పిల్లల భవిషత్ కోసం మంచి విద్యను అందించటానికి పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు మంచి విద్యను అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మారు మూల ప్రాంతంగ ఉన్న మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోనూ కొత్త స్కూల్‌ను ఏర్పాటు చేసి ప్రారంభిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆ తరువాత గ్రౌండ్‌లో ఎమ్మెల్యే క్రికెట్ ఆడి అందరిని ఉత్సాహ పరిచారు.

ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ కె.మాలతి, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, శామీర్‌పేట మాజీ ఎంపిపి బి. ఎల్లుబాయి, మాజీ జడ్పీటిసి ఎం.అనిత లాలయ్య, గ్రామ మాజీ సర్పంచు సి.శ్రీనివాస్‌రెడ్డి, అలియా బాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల పలువురు కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచండి

**దోమ,జూన్ 12, ప్రభాతవార్త:** మండలములో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులందరు బాధ్యతగా పనిచేయాలని దోమ మండల విద్యాధికారి వెంకట్ అన్నారు.శుక్రవారం నాడు దోమ మండల పరిదిలోని దిర్సంపల్లి గ్రామములో ఉపాదిహామి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటింటికి ప్రభుత్వబడి అనే అంశముతో జయశంకర్ బడిబాట కార్యక్రమము చేపట్టినట్లు తెలిపారు.పూర్వ ప్రాథమిక తరగతుల్లో చేర్పించాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులందరిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలనికోరారు.విద్యార్థుల తల్లితండ్రులకు ఖర్చులు లేకుండా ప్రాథమిక విద్యలోనే విద్యార్థులకు రాగిజావా,అల్పాహారం, మధ్యాహ్నభోజనం,ఉచిత పాఠ్యపుస్తకాలు,ఉచితనోట్‌బుక్కులు,అందించడము జరుగుతుందని అన్నారు.ప్రైవేటుపాఠశాలలో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చదివేకన్న నాణ్యమైన విద్యతోపాటు అన్ని వసతులు ఉన్న ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమములో దిర్సంపల్లి గ్రామ సర్పంచ్‌విజయలక్ష్మీవెంకట్‌రాములు,ప్రధానోపాధ్యాయులు కేశవులు,ఉపసర్పంచ్ తిరుపతి,ఏపిపిసి చైర్మెన్ పద్మ,వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## నక్ష బాటలు కబ్జా చేస్తే కఠిన చర్యలు..

### తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ ..

**మొయినాబాద్ ,జూన్ 12,ప్రభాతవార్త:** నక్షా బాటలు ప్రజల సౌకర్యం కొరకు ఉంచిన ప్రభుత్వ ఆస్తులని వాటిని ఎవరైనా కబ్జా చేసినా ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని మొయినాబాద్ తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ హెచ్చరించారు. కనకమామిడి గ్రామం నుండి వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే నక్షా బాట రోడ్డును ఆక్రమించి. ఫెన్సింగ్, ప్రీ కాస్ట్ వాల్స్, రూమ్ లు, కాంపౌండ్ వాల్స్ నిర్మించిన 13 అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మూడు జేసీబీల సహాయంతో నేల మట్టం చేశారు. గత నెలలో పంచాయతీ రాజ్ శాఖ విజ్ఞప్తి మేరకు పక్క పట్టాదారులకు మరియు సంబంధీకులందరికీ నోటీసులు జారీచేసి సర్వే నిర్వహించి. నక్షా బాటలో ఉన్న అక్రమణలను గుర్తించి. భాద్యులకు అనేక మార్లు ఆక్రమణలు తొలగించమని సూచించినప్పటికీ బేఖాతారు చేశారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్ తన సిబ్బందితో కలిసి నేరుగా ఆ ప్రాంతానికి చేరుకుని నక్షా బాటలో వెలిసిన అక్రమ నిర్మాణాలను స్థానిక మొయినాబాద్ పోలీసుల సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ మాట్లాడుతూ.. నక్షా బాటను కబ్జా చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట మండల గిర్దవర్ రాజేశ్, సర్వేయర్ జలజ, పంచాయతీ రాజ్ డీఈ విజయ్ కుమార్, కనకమామిడి పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, కనకమామిడి జీపీవో అజీజ్, గ్రామ నాయకులు మురళీధర్ రెడ్డి, పలువురు వార్డు సభ్యులు, మండల జీపీవోలు రామకృష్ణ, జానకి రామ్, భాస్కర్, గణేష్, నర్సింహా, రాజేష్, ఏఎస్సై వీరారెడ్డి, పోలీస్ సిబ్బంది కృష్ణయ్య, రోజా, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.





## "అధిక మాసం అధిక ఫలం"

**మోమిన్‌పేట్, జూన్ 12. ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సద్గురు శంకర్ భారతీ మహరాజ్ ఆశ్రమమైన (ఏనుగుతల) ఎన్కతలలో హంసారుడుడై కొలువుదీరిన శ్రీశ్రీ శనైశ్వర స్వామి వారి యొక్క శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరిం చుకొని స్వామివారికి ప్రీతిపాత్రమైన నల్లని వస్త్రము, నువ్వులు, నువ్వులనూనె, పూలు పండ్లు సమర్పించి అభిషేకాలు , తైలాభిషేకాలు నేడు ఉద యం 4=30, నుండి సాయంత్రం 7=00, గంటలవరకు నిర్వహించ బడునని ఆలయ కార్య నిర్వాహకులు నరెందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక మాసం కలిసి రావడంతో ప్రత్యేకపూజలు, అభిషేకాలు, హోమాలు, జపం, ,దానం.. ..ఇలాంటివి అధిక ఫలాన్నిస్తాయని భక్తుల ప్రఘాఢ నమ్మకం. కావున స్వామి సేవలో పాల్గొని తమతమ కోర్కెలను తీర్చుకొని తరించ గలరని తెలిపారు. ఇందు కొరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కొరకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు నిర్వామకులు తెలిపారు. కావునా నేడు శ్రీ శనైశ్వర స్వామిని తమతమ కోరికల నిమిత్తం దర్శించుకొని తీర్థప్రసాదములు స్వీకరించి అనంతరం అన్నవితరణలో పాల్గొని తరిం చాలని వారు కోరారు.



ప్రత్యేక పూజలకై కొలువుదీరిన ఎన్కతల శనైశ్వర స్వామి.

## నేడు ఎదులాబాద్‌లో విశ్వశాంతి యాగం

**ఘట్‌కేసర్, జూన్ 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఈనెల 13న తేదీన విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వహక కర్త కంట్లం గౌరీశంకర్ తెలిపారు. లోకకళ్యాణార్థం ప్రతి నెలా మాస శివరాత్రి రోజున ఆలయ ఆవరణలో విశ్వశాంతి యాగము జరుగుతుందని చెప్పారు. శనివారం జరిగే యాగంలో ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ దంపతులు పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశ్వశాంతి యాగాన్ని తిలకించాలని గౌరీశంకర్ కోరారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల రిమాండ్

**ఘట్‌కేసర్, జూన్ 12, ప్రభాతవార్త:** గంజాయికి అలవాటు పడి అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు ధనుష్, లోకేష్‌లు గంజాయికి అలవాటు పడ్డారు. గంజాయి తాగడంతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చి ఘట్‌కేసర్ పరిసరాల్లో అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. ఘట్‌కేసర్‌లోని ఒప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో పోలీసులు విచారించి ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కిలో 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈమేరకు ఇద్దరు నిందితులు ధనుష్, లోకేష్‌లను కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



నిందితులు ధనుష్, లోకేష్

## ఆత్మ నిర్భర్ మండల సమావేశం

**చేవెళ్ల, జూన్ 12, ప్రభాతవార్త :** బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఆత్మనిర్భర్ మండల్ సమావేశం ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి 12 ఏళ్ల సుపరిపాలనను పురస్కరించుకొని బీజేపీ తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్య క్షులు తొండ రవి ఆత్మనిర్భర్ మండల్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల అబి.వృద్ధి, సుపరిపాలన, పేదల సంక్షేమం, జాతీయ భద్రత, డిజిటల్ విప్లవం, మౌలిక వసతుల అభివృద్ధి మరియు వికసిత్ భారత్ దిశగా సాధించిన చారిత్రాత్మక విజయాలను ప్రతిబింబించే విధంగా ఉన్నాయి అని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ నేడు ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగి, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా వేగంగా ముందుకు సాగుతోంది.జన్ విశ్వాస్, వికాస్, జన్ కళ్యాణ్ స్ఫూర్తితో కొనసాగుతున్న ఈ 12 ఏళ్ల సేవా ప్రస్థానం దేశ అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ బోర్డు మెంబర్ సామ మాణిక్య రెడ్డి, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ శర్వలింగం, జిల్లా సీనియర్ నాయకులు కుంచం శ్రీనివాస్, గోటూరి శంకర్ గౌడ్, నరేష్, చాకలి శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, బండారి చంద్రశేఖర్ రెడ్డి, గాజులగూడెం శ్రీనివాస్ రెడ్డి, వడ్డే గణేష్, మహేశ్వర్ రెడ్డి, జై సింహా రెడ్డి, అల్లాడ అభిషేక్ రెడ్డి, మధుకర్ రెడ్డి, పాగ వెంకటేష్, రఘువర్ధన్ రెడ్డి, అదిరే శ్రీశైలం, వడ్ల అక్షయ్, కరుణాకర్ గౌడ్, సామకృష్ణారెడ్డి, రవి, మధుమోహన్ రెడ్డి మరియు పాల్గొన్నారు.



ఆత్మనిర్భర్ మండల సమావేశ దృశ్యం



అలియాబాద్‌లో క్రికెట్ పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, పాల్గొన్న కౌన్సిలర్లు, యువకులు దృశ్యం

## అలియాబాద్‌లో క్రికెట్ పోటీలు

..క్రికెట్ బ్యాటింగ్ చేసి ప్రారంభించిన చైర్‌పర్సన్

**శామీర్‌పేట, జూన్ 12, ప్రభాతవార్త:**

అలియాబాద్ గ్రామంలోని క్రికెట్ గ్రౌండ్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆమె బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. క్రికెట్ బ్యాటింగ్ చేసి పోటీలను చైర్‌పర్సన్ ప్రారంభించి యువతను ఉత్సాహపరిచారు. కౌన్సిలర్ ఎం.సుధాకర్‌రెడ్డి పాల్గొని కీపింగ్ చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని క్రికెట్ గ్రౌండ్‌లో యువతకు క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 30క్రికెట్ టీమ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగ అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ యువతను ప్రోత్సహించటానికి క్రికెట్ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. యువత ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని పోటీల్లో రాణించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు ఎం.సుదాకర్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, నాయకులు ఇప్ప మాదవరెడ్డి, నాగమల్లారెడ్డి, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### బడిబాటతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

-గోకఫస్లావాద్ జడ్‌పిహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో బండివాడలో 'బడిబాట'



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**దౌల్తాబాద్,జూన్ 12,ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచడమే లక్ష్యంగా దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లావాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారంరోజు బండివాడ గ్రామంలో 'బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ,ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య,వసతులపై ప్రజలకు అవగాహన కల్పించారు.బడి వయస్సు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,ఉపాధ్యాయులు ఈశ్వరయ్య,హన్మయ్య,బసప్ప,జ్ఞానేశ్వర్,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

భారతీయ స్టేట్ బ్యాంక్ సంచాలకులు యండీ.అలీఖాన్





**మొయినాబాద్ ,జూన్ 12,ప్రభాతవార్త:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలు కూరు భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్క్ ఉచిత స్వయం ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నామని, శుక్రవారం ఆ సంస్థ సంచాలకులు యండీ.అలీఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసంతి కల్పించబడుతుందన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12వ తేదీ నుంచి చిలుకూరు ఎస్బీఐ సంస్థ కార్యాలయంలో కానీ, 8500165190, 9550606019 గల నంబర్ లలో గానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల కనీస అర్హత 10వ తరగతి ఉత్తీర్ణలై ఉండాలని, వయోపరిమితి 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు లోపు ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 4 పాస్ ఫోటోలు, బ్యాంకు పాసు పుస్తకం, జిరాక్స్ పత్రాలను సమర్పించాలన్నారు. స్వయం ఉపాధి రంగాల్లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని సంస్థ సంచాలకులు యండీ.అలీఖాన్ తెలిపారు.

### చెత్త సేకరణ నూతన ఆటోను ప్రారంభించిన సర్పంచ్

**మొయినాబాద్ ,జూన్ 12,ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగిరెడ్డిగూడా గ్రామపంచాయతీలో చెత్త సేకరణకు నూతన ఆటోను శుక్రవారం గ్రామ సర్పంచ్ కీసరి పద్మా సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కీసరి పద్మ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల పరిశుభ్రత, పారిశుద్ధం నిర్వాణకు మరింత మెరుగుపరచడంలో ఈ ఆటోలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం నిర్మించవచ్చునని గ్రామ సర్పంచ్ కీసరి పద్మా సంజీవరెడ్డి అన్నారు. గ్రామ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ చెత్త సేకరణ ఆటోలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర జైపాల్, వార్డు సభ్యులు హేమలత అర్జున్, వనజా కుమార్, యాదగిరి, రాజు, నిరోషా వికాస్, విజయ్ రాజు, మధుకర్, రోజా మహేందర్, శశిధర్, గ్రామస్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## నమ్మించి మైనర్ బాలికతో వివాహం

: పోక్సో కేసు నమోదు

**ధారూర్, జూన్ 12, ప్రభాత వార్త:** ప్రేమ పేరుతో మైనర్ బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లి, వివాహం చేసుకున్న ఘటనలో ఒకరిపై కేసు నమోదైంది. ఎస్ఐ సున్నం రాఘవేందర్ తెలిపిన కథనం ప్రకారం.. ధారూర్ మండల పరిధిలోని కెరెల్లీ గ్రామానికి చెందిన సాయికుమార్ (27) అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి ఇంటి నుండి బయటకు తీసుకెళ్లాడు. అనంతరం పెద్దేముల్ మండలంలోని ఒక దేవాలయంలో బాలికను వివాహం చేసుకున్నాడు. దీనిపై బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయికుమార్ గతంలో కూడా ఆ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలిక మైనర్ కావడంతో, ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు సాయికుమార్‌పై పోలీసులు కిడ్నాప్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీని సన్మానించిన మైనార్టీ సోదరులు

**కడ్తాల్, జూన్ 12, ప్రభాతవార్త:** స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా నియమితులైన కడ్తాల్ పట్టణానికి చెందిన ఆసిఫ్ అలీని శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో ముస్లిం మైనారిటీ సోదరులు ఘనంగా సన్మానించారు. స్థానిక మసీద్ కుబాలో శుక్రవారం ప్రార్థనల అనంతరం పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆసిఫ్ అలీనీ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా నియమించి సముచిత స్థానం కల్పించినందుకు ముస్లిం మైనారిటీ సోదరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీద్ ఇమామ్ జహీరుద్దీన్, మసీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షుడు జావిద్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా, జహంగీర్ అలీ, ఇర్షాద్, ఇమ్రాన్, అబ్దుల్ వహబ్, గౌస్, బాబా, యూసఫ్, యూనిస్, సలీం, రహీమ్, అనీష్, అజ్గర్ అలీ, ఆశ్రఫ్, ఆరిఫ్, ఖాదర్, హిమాయత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

**వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్**



నీరు నిల్వ ఉన్న పరిసరాలను పరిశీలిస్తున్న సర్పంచ్ ,వైద్యాధికారి

**కుల్కచర్ల,జూన్ 12 ప్రభాతవార్త:** ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి కార్యాలయాలు,ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్,సర్పంచ్ మడుగు శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం మండల పరధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో ఆశ కార్యకర్తతో కలిసి గ్రామంలో పూల కుండీలు,బయట సామగ్రి నిల్వచేసిన చోట నిలిచిన వర్షపునీటిని తోడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నీరు నిల్వ ఉంటే క్రిమికీటకాలు వృద్ధిచెంది అనారోగ్యానికి దారి తీస్తాయని తెలిపారు.నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## అనురాగ్‌లో ఎంబిఎ బిఎఫ్ఎస్ఐ కోర్సు ప్రారంభం



వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో సావనీర్ ఆవిష్కరిస్తున్న యూనివర్శిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 12, ప్రభాత వార్త:** దేశంలోనే తొలిసారిగా ఎంబీఏ బీఎఫ్ఎస్ఐ బ్యాకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్యూరెన్స్ కోర్సును అనురాగ్ యూనివర్శిటీలో ప్రవేశపెడుతున్నట్లు ఎమ్మెల్యే యూనివర్శిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో ఎపిఎంజి ఆధ్వర్యంలో ఎంబిఎ బిఎఫ్ఎస్ఐ కోర్సును ప్రారంభించేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ చైర్మన్ మాట్లాడుతూ అనురాగ్ యూనివర్శిటీలో మౌలిక సదుపాయల కల్పన, క్వాలిటీ అధ్యాపక బృందంచే విద్యాబోధన కల్పించినట్లు తెలిపారు. పరిశ్రమకులు అనుగుణంగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు. ప్రపంచంలోనే నాణ్యమైన విద్య అందించేందుకు అనురాగ్ యూనివర్శిటీ కృషి చేస్తుందని అన్నారు. యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్చనా మంత్రి మాట్లాడుతూ మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల విద్యా అవసరాలు మారుతున్నాయని అన్నారు. విద్యార్థులకు నూతన నైపుణ్యాలు అందించాలంటే అధ్యాపకులు, విద్యార్థులు పాఠ్యాంశాలకు అతీతంగా నేర్చుకునే ధృక్పథాన్ని అలవర్చుకోవాల్సిన అవసరముందని అన్నారు. కెపిఎంజి నేషనల్ లీడర్ ఎడ్యుకేషనల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంటు నారాయణన్ రామస్వామి మాట్లాడుతూ విద్యారంగం వేగంగా మారుతోందని భారత్‌లో బిఎఫ్ఎస్ఐ రంగంలో అనేక వినూత్న మార్పులు వచ్చాయని అన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంటు విభాగాధిపతి వి. విష్ణువందన, డీన్ ఉట్ల బాలాజీ, యూనివర్శిటీ సిఇఒ నీలిమ, ప్యాకల్టీ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఔషధ రంగంలో కృత్రిమమేధస్సు పాత్ర కీలకం

**సిఎస్ఐఆర్ సైంటిస్ట్ నాగయ్య**

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 12, ప్రభాత వార్త:** ఔషధ పరిశోధనలో కృత్రిమమేధస్సు కీలకపాత్ర పోషిస్తోందని సిఎస్ఐఆర్ ఇండియన్ ఇన్సటిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ మెడిసినల్ కెమిస్ట్రీ చీఫ్ సైంటిస్ట్ కె. నాగయ్య అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఎపిటీఐ తెలంగాణ రాష్ట్ర శాఖ సహకారంతో నిర్వహించిన ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ సైంటిస్ట్ నాగయ్య మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డేటా సైన్స్ కంప్యూటేషనల్ బయాలజీ మధ్య అంతరశాఖ సహకారం అవసరమని అన్నారు. అధ్యాపకుల నిరంతర నైపుణ్యాభివృద్ధి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడం నేటి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపీటీఐ తెలంగాణ రాష్ట్ర శాఖ సభ్యులు కృష్ణ మోహన్ చిన్నాల, స్కూల్ ఆఫ్ ఫార్మసీ బి. వసుధ భక్షి, ప్రోగ్రాం కన్వీనర్ జి. బాబా శంకర్‌రావు, కో కన్వీనర్ ఎం. రామ్ మోహన్, ఎపీటీఐ ఉపాధ్యక్షుడు కాంతలం చామకూర తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు నడుస్తున్న తహసిల్దార్

**జవహర్ నగర్ , జూన్ 12, ప్రభాత వార్త:** కాప్రా మండల కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కాప్రా మండల తహసీల్దార్ మథీన్ సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు.అనంతరం మండల సర్వేయర్‌గా విధులు నిర్వహించిన మహేందర్ బదిలీపై వెళ్లనున్న సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించారు. అలాగే జవహర్‌నగర్ ఇన్‌చార్జి జీపీవోగా పనిచేస్తున్న కాశిరామ్ జన్మదిన సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాశిరామ్‌తో కేక్ కట్ చేయించి కార్యాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.పుట్టినరోజు వేడుకలు మరియు సన్మాన కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, స్వర్ణలతా రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు సత్యనారాయణ, చక్రధర్, జీపీవో స్వామి, సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య



మేడ్చల్‌లో మల్లారెడ్డి పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జూన్ 12, ప్రభాతవార్త :** పేద, మధ్యతరగతి వారికి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించాలని పాఠశాలలను నెలకొల్పుతున్నామని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని సరస్వతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మల్లారెడ్డి పాఠశాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను ఆదరించి ఎన్నికల్లో గెలిపించిన మేడ్చల్ నియోజవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని, నా పై నమ్మకంతో ఒక సారి ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, మంత్రి పదవి కూడ దక్కిందని తెలిపారు. ఓ ప్రజా ప్రతినిదిగా అభివృద్ధి చేయడం సాధారణమని, కానీ ఆదిరించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి పాఠశాలలు నెలకొల్పుతున్నానని చెప్పారు. పేద, మద్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను తక్కువ మోతాదు ఫీజులతో విద్యనందిస్తానని అన్నారు. అందుకొరకే పాఠశాలలు నెలకొల్పి ఉత్తమ ఉపాధ్యాకులను ఎంపిక చేసి చదువును అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, కౌన్సిలర్ సురేష్‌రెడ్డి, నాయకులు రాజమల్లారెడ్డి, భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, వెంకటేష్ ముదిరాజ్, రణదీప్‌రెడ్డి, దర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్ రాజు, శైలేందర్, గణేష్, రాజు, అలీ తదితరులు పాల్గొన్నారు.

# ధారూర్ జామా మసీదు నూతన కమిటీ ఎన్నిక

**.. ఏకగ్రీవంగా బాధ్యతలు చేపట్టిన నూతన కార్యవర్గం**

**ధారూర్, జూన్ 12, ప్రభాత వార్త:** ధారూర్ మండల కేంద్రంలోని జామా మస్జిద్ కమిటీని గ్రామ పెద్దల సమక్షంలో అత్యంత పారదర్శకంగా, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మస్జిద్ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశానికి గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు హాజరై చర్చలు జరిపి, కమిటీ సభ్యుల పేర్లను ఖరారు చేశారు. ఈ ఎన్నికలో మస్జిద్ కమిటీ అధ్యక్షుడిగా ఎండి చాన్, ఉపాధ్యక్షుడిగా ఖాజామున్న ఖురేషి, జనరల్ సెక్రెటరీగా షఫీక్ అహ్మద్ (ఆప్యూ)లను గ్రామస్తులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, మస్జిద్ నిర్వహణ, అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం మరో 21 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్, జకీర్, మొయిజ్ , ముజఫర్,యూనస్ లతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులు మస్జిద్ అభివృద్ధి కోసం, మతపరమైన కార్యక్రమాల కోసం ఐక్యంగా పనిచేస్తామని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామస్తులు, పెద్దలు, పూలు శాలువాలతో సన్మంచి, అభినందించారు.



శాలువాలతో సన్మానించిన గ్రామ పెద్దలు

# హకీంపేట్ ఆర్టీసి డిపోలో ఆకస్మిక తనిఖీలు

**శామీర్‌పేట, జూన్ 12, ప్రభాతవార్త:**
హకీంపేట్ ఆర్టీసి డిపోను గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడి ఎ.శ్రీధర్ ఆకస్మికంగా సందర్శించి అన్ని విభాగాలు పర్యటించి తనిఖీలు చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని హకీంపేట్ ఆర్టీసి డిపోను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆర్టీసి గ్రేటర్ హైదరాబాద్ జోన్ నూతన ఇడిగా ఎ.శ్రీధర్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆర్టీసి హకీంపేట్ డిపోను సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను సందర్శించి పలు సమస్యలను తెలుసుకున్నారు. డిపోలో ఆర్టీసికి సంబంధించి రికార్డులు, ఫైల్స్‌ను తనిఖీలు చేశారు. డిపోకు తొలిసారిగ విచ్చేసిన గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఇడి ఎ.శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా డిపో మేనేజర్ సరితాదేవి, ఉద్యోగులు అందరు కలిసి సన్మానించారు. ఆ తరువాత హకీంపేట్ డిపో ప్రాంగణంలో అందరితో కలిసి మొక్కలను ఈడి శ్రీధర్ నాటారు. డిపో ప్రాంగణంలో పర్యావరణం బాగుందని, విస్తృతంగా మొక్కలు, చెట్లు ఉండి మంచి వాతావరణం ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ ఆర్ఎం మహేశ్, ఎంఎఫ్ రాంమోహన్, టిఎంయూ యూనియన్ నాయకులు గోపు శ్రీనివాస్, గ్యారేజ్ సెక్రటరీ రఘు రమేశ్ నాయక్, బొట్టు శ్రీను, సీనియర్ రఘు, మహేశ్, ఎల్ఓ శుభానుద్దీన్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



.హకీంపేట్ ఆర్టీసి డిపో ప్రాంగణంలో మొక్కలు నాటిన ఆర్టీసి గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడి ఎ.శ్రీధర్,పాల్గొన్న తదితరుల దృశ్యం

## బూత్ ఏజెంట్ల నియామకానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రద్ధ తీసుకోవాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** బూతు స్థాయి ఏజెంట్ల నియామకానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత సూచించారు. శుక్రవారం ప్రత్యేక ఇంటెన్సివ్ పునఃపరిశీలన (ఎస్ఆర్ఐ)లో భాగంగా బూతు స్థాయి ఏజెంట్ల నియామకం, మ్యాపింగ్ ప్రక్రియ, ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన వికారాబాద్ నియోజ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేనట్లయితే ఎస్ఐఆర్ పారదర్శకంగా ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్ లను నియమించడం లేదని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బిఎల్ఏ ల జాబితాలను తప్పని సరిగా సమర్పించాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో బూతు స్థాయి అధికారులను సంప్రదించి బోగస్, డబుల్, మరణించిన ఓటర్ల ను తొలగించే విషయంలో స్థానికంగా ఉన్న బిఎల్ఏ ల సహకారం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. పూర్తిస్థాయిలో బిఎల్ఏల జాబితాను సమర్పించాలని ఆమె తెలిపారు. ఓటర్‌జాబితాకు సంబంధించి ఏవైనా తప్పులు దొర్లినట్లయితే ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే విధంగా ప్రజలకు సూచించాలని వివిధ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి

**..గుడ్డ,జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహించండి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 12, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారులు ప్రజలకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి-గుడ్డ, జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహించండి అనే అంశంపై అవగాహన కల్పించి వాటిని ప్రదర్శించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని జీడిమెట్లలో ఉన్న ప్రాంతీయ కార్యాలయం (జెఐఎ)లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమంలో వివిధ ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, వ్యాపారులు, దుకాణదారులు, పలువురు పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్లాస్టిక్ విని యోగాన్ని తగ్గించే వ్యూహాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్‌కు పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగం పలు అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సహజ వనరుల సంరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. భవిషత్ తరాల కోసం సహజ వనరులను పరిరక్షించటం, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటం అత్యంత అవసరమన్నారు. వాయు, నేల, జల కాలుష్యానికి సంబంధించిన పర్యావరణ సమస్యలపై దీనిలో చర్చించారు. ప్రదర్శనకు స్టాల్స్‌ను కూడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ మేడ్చల్ పర్యావరణ ఇంజనీర్,నోడల్ అధికారి బి.రాజేందర్, సంబంధిత అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.




మేడ్చల్ జిల్లాలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి-గుడ్డ, జనపనార సంచులను వినియోగాన్ని ప్రోత్సహించండి ప్రదర్శన చేసిన సంబంధిత అధికారుల దృశ్యం

# పాటల సిడిని ఆవిష్కరించిన అశోక్

**శామీర్‌పేట, జూన్ 12, ప్రభాతవార్త:**
ప్రజా గాయకుడు దివంగత గద్దర్ ఉద్యమ స్ఫూర్తితో గత 30ఏళ్లుగా కళాకారునిగా ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్ రాణిస్తున్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్ గ్రామంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్ తనపై వొల్లపు స్వామి పాడిన సాంగ్ సీడిని ఆయన ఆవిష్కరించారు. ఈ పాటకు రచనగా బండకాడి గణేశ్,సంగీతం సత్యదీప్ అందించారు. ఎన్నో ఉద్యమాలు చేసి జాతి కోసం పోరాడుతున్న ఎన్‌వై.అశోక్ శనివారం పుట్టిన రోజును జరుపుకుంటున్న సందర్భంగా తనపై పాడిన పాటల సీడిని ఎన్‌వై అశోక్ ఆవిష్కరించారు. అణగారిన, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం చైతన్య పర్చటానికి, అదే విధంగా ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తూ ఆట పాటలతో కళాకారునిగా జాతీయ స్థాయిలో రాణించి అందరిలో మంచి గుర్తింపును ఎన్‌వై అశోక్ సాధించినట్లు పలువురు పేర్కొన్నారు. దళిత సామాజిక వర్గం కోసం పేదల పక్షాన ఉంటూ ప్రజలను చైతన్యం చేస్తూ ఆట పాటలతో ఎన్.వై.అశోక్ మంచి గుర్తింపును పొందారని ఆయన కళారంగానికి అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. ఎంఆర్‌పిఎస్ చేస్తున్న పోరాటాల్లో, ఉద్యమాల్లో ఆట పాటలతో కళాకారునిగా ఆయన ప్రత్యేక గుర్తింపును పొంది ఆ సామాజిక వర్గం కోసం ఎన్నో పాటలు పాడి ఆట,పాట కార్యక్రమం ద్వారా మరింత గుర్తింపును పొందారు.



దేవరయాంజాల్‌లో ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్‌వై.అశోక్ కోసం స్వామి పాడిన పాటల సీడిని ఆవిష్కరించిన దృశ్యం

మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు




## గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలి

**తహసిల్దార్‌కు బిజెపి నాయకుల వినతి**

**మేడ్చల్, జూన్ 12, ప్రభాతవార్త :** మేడ్చల్ డివిజన్ పరిధిలోని అత్వెల్లిలో గల "గంగ వెంచర్" లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ఆధ్వర్యంలో మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ... గంగ వెంచర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో సామాన్య ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల పాలువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేం దాస్, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శి బండి విష్ణు, నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, బొజ్జ రాఘవ రెడ్డి, తోట అనిత, బొజ్జ వంశీ రెడ్డి, జకట బాబు రాజు, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, పురుషోత్తం, మల్లికార్జున్, ఎన్.ఎస్.గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగాపూర్‌లోని సమస్యలను పరిష్కరించాలి



సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ తనయుడు గోవు రవికుమార్

**పాలక మండలి సభ్యులతో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పణ**

**నందిగామ, జూన్ 12, ప్రభాతవార్త :** ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడంలో భాగంగా లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం గడియారపు ముల్లులా అహర్నిశలు భగీరథ ప్రయత్నం చేసి విజేతగా నిలిచిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కి శుక్రవారం రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ కుమా రుడు గోవు రవికుమార్, పాలకవర్గసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి .. జనహిత సమాజం కోసం సిఎం రేవంత్ రెడ్డి సర్కార్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై సామాన్య ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. ఈ సందర్భంగా రంగాపూర్ నుండి బైపాస్ జాతీయ రహదారి వరకు, రంగాపూర్ నుండి పెంజర్ల వరకు బిటి రోడ్డు, సల్వేంద్ర గూడకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, మల్లయ్య చెరువు మరమ్మతులు చేపట్టి మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయాలని, రాజేంద్ర నగర్ నుండి మేకగూడకు వచ్చే సిటీ ఆర్టీసీబస్సును రంగాపూర్ చలివేంద్ర గూడ మీదుగా ప్రయాణించేలా వెళ్లాలని ఎమ్మెల్యేను మొరపెట్టుకున్నారు. రంగాపూర్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రంగాపూర్ ఉప సర్పంచ్ జింకల బసవయ్య, నందిగామ పిఎసిఎస్ చైర్మన్ రాజగోపాల్, వార్డు సభ్యులు నవపేట శ్రీనివాస్, ముచ్చర్ల శ్రీరాములు, కావలి రాధ అంజయ్య, జింకల రామచంద్రయ్య కాంగ్రెస్ సీనియర్ నేత జింకల జంగయ్య యాదవ్ ,తదితరులు ఉన్నారు.



నందిగామ ఉప సర్పంచ్ ప్రసంగం అధ్యక్షుడిగా ఎన్నికైన ఆవుల మంద శివ శంకర్

## నందిగామ ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా చేగూరు ఏకగ్రీవం

**నందిగామ, జూన్ 12, ప్రభాతవార్త :** నందిగామ మండలంలోని 19 గ్రామపంచాయతీలో ఉన్న ఉపసర్పంచ్‌ల సంఘం ఎన్నిక శుక్రవారం జరిగింది. ఈ ఎన్నికలో నందిగామ మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులుగా చేగూరు ఆవుల మంద శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మేకగూడ ఎడ్ల శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా నందిగామ సార వెంకటేష్ గౌడ్, శ్రీనివాసులుగూడ లచ్చిగారి గోపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంతిరెడ్డిగూడ జంగ మల్లేష్ లు ఎన్నికైనట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు.

మిగతా 14 మంది ఉప సర్పంచులు సభ్యులుగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఆవుల మంద శివశంకర్ మాట్లాడుతూ ఉప సర్పంచ్‌ల హక్కుల సాధన కోసం రాజకీయ పార్టీలను పక్కనపెట్టి ఉప సర్పంచులలో ఐక్యతను, పరిపాలన దక్షతను పెంపొందించడానికి, గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో సంఘం నియమించినట్లు చెప్పారు. తనపై నమ్మకంతో, విశ్వాసంతో ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా నియమించినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




## సిపిఎం యువజన సమ్మేళనం విజయవంతం చేయాలి

**చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్**

**మొయినాబాద్ ,జూన్ 12,ప్రభాతవార్త:**
సిపిఎం పార్టీ మొయినాబాద్ మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ యువజన సమ్మేళనంకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ మాట్లాడుతూ.. ఈనెల 16, 17 తేదీలలో రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ లో యువజన సమ్మేళనం రెండు రోజులపాటు జరుగుతాయని రాష్ట్రవ్యాప్తంగా యువజనులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై సమ్మేళనంలో చర్చించి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు.యువజన సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా సీపీఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఎం యువజన సంఘం డివైఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు రాజ్యసభ ఎంపీ ఏ.ఏ.రహీం తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మొయినాబాద్ మండల నాయకులు ముంజగళ్ళ ప్రభుదాస్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు వినోద్ నాయుడు సీపీఎం నాయకులు చిన్న, కాజా మియా, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.